నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 26 ఆగస్టు 2024 | MEDAK


సిద్దిపేటలో కొరివి కృష్ణస్వామి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా చేర్యాల-నాగపురి రోడ్డులో ఏర్పడిన గుంతలు

ముదిరాజ్‌లు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట,ఆగస్టు 25: సిద్దిపేట పట్టణంలో కొరివి కృష్ణస్వామి విగ్రహం ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉన్నదని..అతడి స్ఫూర్తితో ముదిరాజ్‌లు ఆర్థికంగా, సామాజికంగా మరింత ఎదగాలని మాజీమంత్రి సిద్దిపేట, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ రోడ్డులో ఏర్పాటు చేసిన కొరివి కృష్ణస్వామి విగ్రహావిష్కరణలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం సభ్యుడు పిట్ల నగేశ్ తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. కృష్ణస్వామి విగ్రహానికి పూలమాల వేసి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. కొరివి కృష్ణస్వామి హైదరాబాద్ నగర మేయర్‌గా ఎన్నో సేవలు అందించి ముదిరాజ్‌లకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రెండు ఎకరాల స్థలంలో సిద్దిపేటలో ముదిరాజ్ ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించుకున్నామన్నారు. ప్రతి గ్రామంలో ఆత్మ గౌరవభవనాలు ఉన్న ఎకైక నియోజకవర్గం సిద్దిపేట ఒక్కటేనన్నారు. మత్స్యకారులకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది కొత్త సభ్యత్వ కార్డులు మంజూరు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. ముదిరాజ్‌లు కృష్ణస్వామి మార్గంలో ఐక్యంగా ముందుకుసాగాలని, మరింత స్ఫూర్తితో ముందడుగు వేయాలన్నారు. చౌరస్తాను కృష్ణ స్వామి జంక్షన్‌గా పిలువనున్నట్లు ఆయన ప్రకటించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ వైస్‌చైర్మన్ కనుకరాజు, కౌన్సిలర్ బర్ల మల్లికార్జున్, నాయకులు జంగంటి శ్రీనివాస్, ప్రశాంత్, సిద్ధరబోయిన శ్రీనివాస్, జిల్లేల సుధాకర్, ధర్మా,కీసర పాపయ్య, కోనయగారి సంతోష్, కోనయగారి ఎల్లయ్య, రెడ్డి యాదగిరి, వెంకటేశం, రామకృష్ణ, ముదిరాజ్ సమాజం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్ అభివృద్ధికి కృషి

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట కమాన్, ఆగస్టు 25 : సిద్దిపేటలో సరస్వతి శిశుమందిర్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి మంచి పౌరులను అందించే విద్యాలయాలు సరస్వతి శిశుమందిరాలన్నారు. పూర్వ విద్యార్థిగా పాల్గొనడం సంతోషంగా ఉన్నదన్నారు. నేను ఒకటోతరగతి నుంచి ఆరోతరగతి వరకు సరస్వతి శిశుమందిరంలో చదువుకున్నానన్నారు. ఇక్కడ చదువుకున్న వారికి ఆత్మవిశ్వాసం, మనోధైర్యం ఎక్కువగా ఉంటుందన్నారు. ఎలాంటి కష్టమైనా ఎదుర్కొనే శక్తి వస్తున్నదన్నారు. సామాజిక బాధ్యత, దేశభక్తి పెంపొందించే ఉత్తమ పాఠశాలలు సర్వస్వతి స్కూళ్లు అని గుర్తుచేశారు. సమాజం కోసం స్వచ్ఛందంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యను అందిస్తారన్నారు. సరస్వతి శిశుమందిర్‌లో ఇంగ్లిష్ విద్యాభ్యాసం కూడా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్ మల్లికార్జున్, పాఠశాల బృందం పాల్గొన్నారు.

సిద్దిపేట సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

పూజలు అందుకుంటున్న వనదుర్గ అమ్మవారు

ఏడుపాయల్లో పోటెత్తిన భక్తులు

పాపన్నపేట్, ఆగస్టు 25: మెదక్ జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవానిమాతను ఆదివారం పెద్దఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలోని పాయల్లో పుణ్యస్నానాలు చేసి దుర్గమాతను దర్శించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏడుపాయల ఈవో చంద్రశేఖర్, రవివీర్‌కుమార్, సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తోట నర్సింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్ ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ పూజలు నిర్వహించగా పాపన్నపేట్ ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

దమ్ముంటే రూ.170 కోట్ల నిధులు వెనక్కి తేవాలి

బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 25: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మంజూరైన రూ.170కోట్ల నిధులను స్థానిక కాంగ్రెస్ నాయకులు వెనక్కి తీసుకొచ్చి గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.170కోట్ల నిధులను నియోజకవర్గ అభివృద్ధి కోసం రాకుండా అడ్డు పడిందన్నారు. పెండింగ్‌లో ఉన్న బ్యాలెన్స్ పనుల కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.19కోట్లు మంజూరు చేస్తే స్థానిక నాయకుల అసమర్థత కారణంగా అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గజ్వేల్‌లోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, నీటిపారుదల జిల్లా కార్యాలయాలను కొడంగల్‌కు తరలించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. మంజూరైన నిధులను కాపాడుకోలేని, సోయిలేని కొంత మంది అధికారం చెలాయిస్తున్న కాంగ్రెస్ నాయకులు నైతిక బాధ్యత వహించి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. వేల కోట్లతో గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో కేసీఆర్ అభివృద్ధి చేశారని, ఆయన్ని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని, కనీసం కేసీఆర్ కాలిగోటికి కూడా సరిపోరని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు ప్రొటోకాల్ లేని వారికి వత్తాసు పలకడం మానుకోవాలని, లేనిచో త్వరలోనే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. చిల్లర మాటలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నదన్నారు. ప్రభుత్వానికి దమ్ముంటే ఆంక్షలు లేకుండా నిబంధనలు పెట్టకుండా బ్యాంకులో రుణం తీసుకున్న ప్రతి రైతుకూ ఏకకాలంలో రూ. రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

జపాన్‌తో మరింత భాగస్వామ్యం పెరిగేలా కృషి

ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

సంగారెడ్డి ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): జపాన్ దేశంలోని కంపెనీలు, సాంకేతిక విద్యాసంస్థలతో మరింత వ్యూహాత్మక భాగస్వామ్యం పెంపొందించుకునేందుకు ఐఐటీ హైదరాబాద్ కృషి చేస్తున్నట్లు ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీహెచ్‌లో ఆదివారం జపాన్ ఎక్స్‌టర్నల్ అర్గనైజేషన్(జైట్రో) ఆధ్వర్యంలో 'జపాన్ కెరీర్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐటీహెచ్‌లో 2018 నుంచి జపాన్‌లో ఏటా కెరీర్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఐటీహెచ్ విద్యార్థులు జపాన్‌లో ఉద్యోగాలు పొందేందుకు ఇది ఉపయోగపడుతున్నదన్నారు. జెట్రో బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుతామీ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎనిమిది పెద్ద కార్పొరేట్ కంపెనీలు, ఐదు ఎస్ఎంబీ కంపెనీలు, ఐదు స్టార్టప్ కంపెనీలు ఐఐటీహెచ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జపాన్ కంపెనీల ప్రతినిధులు, ఐఐటీహెచ్ విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అక్షరమాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

ఘనంగా అక్షరమాల నాలుగో వార్షికోత్సవం

కందిలోని ఐఐటీహెచ్‌లో ఆదివారం అక్షరమాల నాలుగో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐఐటీహెచ్‌కు చెందిన గ్రామీణ అభివృద్ధి కేంద్రం(ఆర్‌డీసీ) గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అక్షరమాల ద్వారా ఆన్‌లైన్ విద్యాబోధనను అందజేస్తున్నది. అక్షరమాల వార్షికోత్సవ వేడుకల్లో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ అక్షరమాల ద్వారా తెలంగాణలోని తొమ్మిది జిల్లాల్లోని 70 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 4వేల మంది విద్యార్థులకు ఆన్‌లైన్ బోధన చేస్తున్నట్లు చెప్పారు. ఐఐటీహెచ్‌తోపాటు 11 అగ్ర ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 150 మంది వలంటీర్లు అక్షరమాల ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పాఠాలు బోధిస్తున్నట్లు చెప్పారు. అక్షరమాల 2023-24లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన ఏడుగురు టెన్త్ విద్యార్థులకు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి నగదు పురస్కారాలు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డీసీ చైర్మన్ సతీశ్, ఎస్‌సీఈఆర్‌టీ అధికారి సురేశ్‌బాబు, డీఈవో వెంకటేశ్వర్లు, 50 మంది విద్యార్థులు, వందమంది వలంటీర్లు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, హాజరైన జపాన్ ప్రతినిధులు

ప్రయాణం..ప్రమాదకరం

అధ్వానంగా 'చేర్యాల-నాగపురి' రోడ్డు

- సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- తరచూ యాక్సిడెంట్లు.. ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- నాలుగు గ్రామాల ప్రజలకు అవస్థలు
- డబుల్ లేన్‌గా మార్చాలని స్థానికుల డిమాండ్

సిద్దిపేట జిల్లా చేర్యాల-నాగపురి రహదారిలో నాగపురి గ్రామం వద్ద రోడ్డు దుస్థితి

చేర్యాల,ఆగస్టు 25: రోడ్ల విస్తరణపై సర్కారు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల-నాగపురి రోడ్డు ప్రమాదకరంగా మారింది. సింగిల్ లైన్ రోడ్డు పై ట్రాఫిక్ పెరిగిపోవడంతో తరచూ రహదారిపై యాక్సిడెంట్లు జరుగుతుండడంతో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. దశాబ్దాలుగా చేర్యాల-నాగపురి రోడ్డు సింగిల్ రోడ్డుగానే ఉండిపోయింది. దీంతో చేర్యాల మండలంలోని నాగపురి,శబాష్‌గూడెం, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి గ్రామాల ప్రజల బాధలు వర్ణణాతీతంగా మారాయి. ఇదే గ్రామాలకు చెందిన విద్యార్థులు సైతం చేర్యాల పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తుంటారు. అన్నివర్గాలకు ఎంతో ఉపయోగపడే చేర్యాల-నాగపురి రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలని నాగపురి గ్రామస్తులు నిత్యం ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. అయినప్పటికీ రోడ్డును విస్తరించేందుకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

కీలకమైన రోడ్డు మార్గం

చేర్యాల మండలంలోని 15 గ్రామాల ప్రజలతో పాటు మద్దూరు, ధూళిమిట్ట మండలం, జనగామ జిల్లాలో బచ్చన్నపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు చేర్యాల మీదుగా కడవేర్గు, పెద్దరాజుపేట, నాగపురి, శబాష్‌గూడెం మీదుగా జగదేవ్‌పూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి, మేడ్చల్ జిల్లా కీసర మీదుగా హైదరాబాద్‌కు, ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఇదే గ్రామాల మీదుగా హైదరాబాద్‌లోని ఈసీఐఎల్, కుషాయిగూడ, నాగారం, బాలాజీనగర్, దమ్మాయిగూడ, రాంపల్లి, కీసర, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల నుంచి వెళ్లి అక్కడ జీవనం సాగిస్తున్న ప్రజలు తమ వాహనాల్లో వందల సంఖ్యలో ఇదే రోడ్డు మార్గంలో వస్తుంటారు. పండుగ, పర్వదినాల్లో ఈ రోడ్డు ట్రాఫిక్‌తో నిండిపోతుందంటే అతిశయోక్తి కాదు. వరంగల్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు వెళ్లి అక్కడి నుంచి నాగపురి-చేర్యాల రోడ్డు పై తిరిగి వరంగల్‌కు వెళ్తుంటారు.

రోడ్డు పై ప్రయాణం ఇబ్బందికరం

ఆర్అండ్‌బీ శాఖకు చెందిన చేర్యాల-నాగపురి రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలు, బస్సులు, ఆటోల్లో వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. సింగిల్ రోడ్డుపై ప్రయాణ సమయంలో ఎదురెదుగా వాహనాలు వస్తే రోడ్డు దిగి ఎక్కాలంటే ఇబ్బందిగా మారింది. రోడ్డు గుంతలమయంగా మారి ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధితశాఖ అధికారులు స్పందించి సింగిల్ రోడ్డుగా ఉన్న చేర్యాల-నాగపురి రహదారిని డబుల్ రోడ్డుగా మార్చడంతోపాటు ప్రమాదాలు జరిగే స్పాట్లను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాటి గ్రామ పంచాయతీ సమీపంలో గుంతలమయంగా మారిన రోడ్డు

గుంతలమయంగా పాటి రోడ్డు

- మరమ్మతులు చేయని ఆర్అండ్‌బీ శాఖ
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పటాన్‌చెరు, ఆగస్టు 25: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాటి గ్రామం నుంచి ఘనపూర్, వెలిమెల వైపు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. ఔటర్ సర్వీసు రోడ్డు నుంచి ఘనపూర్, వెలిమెల, కొల్లూరు గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. ముఖ్యంగా పాటి గ్రామ కమాన్ నుంచి గ్రామ పంచాయతీ వరకు రోడ్డు గతుకులమయంగా మారింది. వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రోడ్డుపై గుంతలు, కంకర తేలాయి. దీనికి తోడు వర్షం పడటంతో ఆ నీరు గుంతల్లో నిలుస్తున్నది. ద్విచక్రవాహనదారులు, కార్లు, ఆటోల్లో ప్రయాణించేవారు ఈ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. రోడ్డుకు ఆర్అండ్‌బీశాఖ అధికారులు మరమ్మతులు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చినా, పంచాయతీ తరపున కనీసం గుంతలను కూడా పూడ్చడం లేదు. పాటి గ్రామస్తులే అధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ భవనం సమీపంలోనే ఈ దుస్థితి నెలకొనడం విచారకరం. రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు ఎన్నిసార్లు అధికారులను కోరి నా సమస్య పరిష్కారం కావడం లేదు. సంబంధితశాఖ అధికారులు గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతుల్లో జాప్యం

న్యాల్‌కల్ మండలంలో అధ్వానంగా ఆర్అండ్‌బీ రోడ్లు

న్యాల్‌కల్, ఆగస్టు 25: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని పలు గ్రామాల మీదుగా వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. సంబంధిత అధికారుల అలసత్వం..కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మండలంలోని మెటల్‌కుంట-అల్లాదుర్గం రోడ్డు మార్గంలో రాయికోడ్ మండలం శంషోద్దీన్‌పూర్ నుంచి మెటల్‌కుంట వరకు రోడ్డు మరమ్మతుల కోసం రూ.5.60 కోట్లు మంజూరు చేసింది. రోడ్డు పనులు చేపట్టేందుకు టెండర్లు సైతం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా పనులు చేపట్టడం లేదు. వరుసగా ఎన్నికలు రావడంతోపాటు ప్రభుత్వం కూడా మారడం..ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. గుంతలుపడిన రోడ్డు గుండా రాకపోకలు సాగించాలంటే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి సమయంలో సైతం గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరూ చనిపోగా, మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి కొత్తగా వచ్చే వారు రోడ్లపై ఏర్పడిన గుంతలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల వాహనదారులు కోరుతున్నారు.

సంగారెడ్డి జిల్లాలో అధ్వానంగా అల్లాదుర్గం-మెటల్‌కుంట ఆర్అండ్‌బీ రోడ్డు


కాట్రియాల ఉపసర్పంచ్ ఇచ్చిన చెక్కును పిల్లలకు అందజేస్తున్న సర్దార్

అనాథ పిల్లలకు దాతల దాతృత్వం

రామాయంపేట, ఆగస్టు 25: అనాథ పిల్లలకు కొంతమంది దాతలు అండగా నిలుస్తూ నగదు అందజేస్తున్నారు. ఆదివారం నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన 'ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు' కథనానికి దాతలు స్పందించారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతెపల్లి పంచాయతీ పరిధిలోని జేమ్లా తండాకు చెందిన చిన్నారులు తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథలుగా మారిన విషయం తెలిసిందే..మెదక్ జిల్లా కాట్రియాల గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి, గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొత్త స్రవంతి భర్త రాజేందర్ రూ. 5,100 బ్యాంకు చెక్‌ను తండావాసి, గిరిజనుడు సర్దార్ చేతుల మీదుగా పిల్లలకు అందజేశారు. ప్రైవేట్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి ఇద్దరు చిన్నారులకు నెలకు సరిపడా నిత్యావసరాలు అందజేస్తానని ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన సంఘసేవకుడు, వైద్యుడు మోహన్ తనవంతు సాయం చేస్తానని ప్రకటించినట్లు తెలిపారు. మరి కొంతమంది దాతలు కూడా స్పందించి ఫోన్ పే ద్వారా డబ్బులు అందజేస్తామని చెప్పినట్లు చిన్నారులు పేర్కొన్నారు. అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రబలుతుంటే పట్టించుకోరా?

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 25: రాష్ట్రంలో డెంగీ, ఇతరత్రా జ్వరాలతో దవాఖానల్లో బెడ్లు దొరక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఏంచేస్తున్నదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. పీసీసీల కోసం, మంత్రి పదవుల కోసం ఢిల్లీకి వెళ్లడం తప్పా అసలు ఈ ప్రభుత్వం నడుస్తుందా.. అని అడిగారు. ఆదివారం సిద్దిపేట పట్టణ శివారులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..రాష్ట్రంలో ఒక్కరోజే ఐదుగురు డెంగీతో చనిపోయారని వార్తలు వస్తున్నాయన్నారు. వాతావరణంలో జరిగే మార్పుల వల్ల విషజ్వరాలు ప్రబలుతున్నాయని ప్రభుత్వం వెంటనే స్పందించి సమీక్ష నిర్వహించడంతో పాటు దవాఖానల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. హైడ్రా పేరుతో సమస్యలను పక్కదారి పట్టించవద్దన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో కాలం చెల్లిన మందులు ఇవ్వడం వల్ల నేడు పిల్లలు చనిపోయే పరిస్థితి రాష్ట్రంలో ఉన్నదన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో సిబ్బందిని నియమించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. రాష్ట్రంలో వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, స్థానిక సంస్థల ఎన్నికలు తొందరగా నిర్వహించకపోతే కేంద్రం నిధులు ఆలస్యమవుతాయన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

జహీరాబాద్ మండలంలోని దిడిగి గ్రామ కృషి విజ్ఞాన కేంద్రంలో ఆకు కూరల గురించి వివరిస్తున్న డాక్టర్ సలోమి, రైతు లక్ష్మమ్మ

ఆకుకూరల్లో అధిక పోషకాలు

పోషకాహార నిపుణురాలు డాక్టర్ సలోమి

కోహీర్, ఆగస్టు 25: ఆకు కూరల్లో అధికపోషకాలు ఉంటాయని పోషకాహార నిపుణురాలు డాక్టర్ సలోమి అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని దిడిగి గ్రామ కృషి విజ్ఞాన కేంద్రంలో దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆకుకూరల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరల్లో పోషకాహారం లభిస్తుందన్నారు. పాలకూర, కొత్తిమీర, ఉసిరి కంటే అధికంగా వేరే ఆకుకూరల్లో పోషకాలు ఉంటాయన్నారు. కానీ వాటి గురించి చాలామందికి తెలియక కలుపు మొక్కలు అనుకొని చేల నుంచి తొలిగిస్తున్నారని చెప్పారు. ప్రకృతి సిద్ధంగా లభించే ఆకు కూరలతో రోగనిరోధకశక్తి పెరుగుతున్నదన్నారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సంస్థతో కలిసి ఆకుకూరల్లో లభించే పోషకాలపై చేపట్టిన పరిశోధనలో స్పష్టంగా తేలిందన్నారు. పొలాలను సందర్శించి ఆకుకూరలపై అవగాహన పెంచుకోమన్నారు. 20 రకాల ఆకు కూరలతో తయారు చేసిన వంటకాలను ఆరగించారు. సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో జీవవైవిధ్య రైతు లక్ష్మమ్మ, మాణిక్యం, రైతులు తదితరులు పాల్గొన్నారు.